# మైకం

— ఎమ్. హేమలత

"అమ్మగారూ! నా పనైపోయింది. నన్నింటికెళ్ళమంటారా?"

సరోజ పిలుపుకి వెనుతిరిగి చూసింది వనజ. 'ఇంకేమైనా పనిమిగిలిందా?' అన్నట్లు ఓ మారు ఇల్లంతా కలియజూసింది. ఎక్కడివక్కడ నీట్‌గా సర్దిఉన్నాయి.

"సరోజ పనికి వంకపెట్టలేం..." మనసు లోనే మెచ్చుకుంది వనజ.


"ఆఁ అన్నట్లు ఒక్క నిముషమాగు. నీకో సం కొత్తచీర కొన్నాను..." గేటు దాటబో తున్న సరోజ, 'చీర' అన్న వనజ మాటకి సంతోషంతో వెనక్కి తిరిగింది.

"అందరికీ కొత్త బట్టలు కొన్నాను. మరి నిన్నెలా మర్చిపోతాననుకున్నావు?" అంటూ, లోపలికెళ్ళి ఊదారంగు ప్రింటెడ్ నైలాన్ చీరను తెచ్చి సరోజ చేతిలో పెట్టింది వనజ.

"ఈ రోజు ఏం పండగ అమ్మగారూ!" చీరను అందుకుంటూ అడిగింది సరోజ.

"ఈ రోజు మా పెళ్ళి రోజు కదే పిచ్చి మొద్దూ - మరిచిపో యావా?"

"ఔ, నేను మరి చేపో యాను. మరి మనింట్లో పార్టీ లేదామ్మా...?"



"ఊహూఁ... ఈ రోజు నేనూ మీ అయ్య గారు బయటహోటల్లో భోంచేస్తాం. అన్నట్లు మరిచాను...నీ పెళ్ళయింది కూడా జనవరి ఫస్టునేకదా?"

"అయితే ఏంటమ్మా! మా మొహాలకి పెండ్లి రోజులు కూడానా? ఆడు తాగకుండా ఇంటికి వచ్చిన రోజే నమ్మా మా పుట్టిన్రో జులు, పెండ్లిరోజులు..." బాధగా అంది సరోజ.

"వాడిక చస్తే తాగనంటూ ప్రమాణం చేసి నట్లు చెప్పావు కదే నువ్వామధ్య..." అంది వనజ.

"అయ్యోరామ! అట్టాంటి పెమానాలు చాలానే చేసాడమ్మా. ఇంకాడు మార్తాడని నేను కలలో కూడా అనుకోను..." సోఫా పక్కన చతికిలబడి, అమ్మగారిచ్చిన చీరను అపురూపంగా చూసుకోసాగింది సరోజ.

"నువ్వు మెత్తగా ఉంటే ఉపయోగంలేదే. గట్టిగా చెప్పు... కోప్పడు.. అలుగు... అదీ కాకుంటే బెదిరించు..." షాంపూ చేసుకున్న జుట్టును వెనక్కి బ్రష్‌చేస్తూ అంది వనజ.

"అవన్నీ మీ గొప్పోళ్ళకే లేమ్మా... మా కవన్నీ ఏం తెలుస్తాయి. గట్టిగా మాట్లాడితేనే తన్నులూ... పిడిగుద్దులూ. నెల్రోజుల ముందు ఇక తాగనంటూ చంటిదానిమీద పెమానం చేశాడు. కానీ ఆడి దారి ఆడిదే నమ్మా. ఏ నడిరాత్రికో గాని కొంపకురాడు. నేనిక గట్టిగా అడగడమే మానుకున్నాను- పయోజనం లేదని."

సరోజ వెళ్ళిపోయిన ఎంతో సేపటివరకు ఆ విషయమే ఆలోచిస్తూ కూచుండిపో యింది వనజ.

-ఈ బడుగువర్గాలు బాగుపడి బట్టకట్టే దెప్పుడో? ఒళ్ళు హూనం చేసుకొని సంపాదించిం దంతా మద్యానికి తగులబెట్టి తమ బ్రతుకు లను ఎందుకిలా వెతలపాటు చేసుకుంటారో?...

సారా తాగిన మత్తులో తమ కంపెనీ కారును యాక్సిడెంట్ చేసి ఉద్యోగం పోగొ ట్టుకున్న డ్రైవర్ రాధాకృష్ణగుర్తు కొచ్చాడు. వనజకి. కారు నడపడంలో వాడి నిపుణత, పనిపట్ల వాడి నిబద్ధత. అధికారులపట్ల వాడి నమ్రత, వినయవిధేయతలు అన్నీ మంటగ ల్సిపోయాయ్ ఆ యాక్సిడెంట్‌తో.

పాపం -సరోజ! అది కష్టజీవి. దాని భర్త ఆటోనడిపి ఏం సంపాదిస్తాడో -ఏమోకానీ -ఇంటికి పైసా ఇవ్వడు.నాలుగిళ్ళలో పని చేసి ఉన్నంతలో పిల్లలకి పెట్టి -తానింత తిని గుట్టుగా ఇల్లు నడుపుకొస్తూంది. మాట పొందిక, శుభ్రత, పనివాళ్ళలో అరుదుగా కన్పించే నమ్మకం ఉండబట్టి నిలకడగా బతు కుని వెళ్ళదీసుకోగల్గుతూంది.

సప్తస్వరాల మ్యూజికల్ క్లాక్ గంటగంటకీ తనపని తానిర్వర్తిస్తూ, వనజని ఈ మారు హెచ్చరించింది, మీవారు వచ్చేటైం కావ చ్చిందంటూ. వనజ లేచి మేడమీదికి దారితీ సింది. ఆయమ్మ బాబుని ఎంతవరకు తయారు చేసిందో చూడ్డానికి.

ముద్దులు మూటగట్టే మూడేళ్ళ కొడుకు 'మమ్మీ!' అంటూ ఎదురొచ్చాడు. వాడ్ని కాసేపు ముద్దుచేసి, మళ్ళీ ఆయమ్మకి అప్పగించి తనగదిలోకి నడిచింది వనజ- పార్టీకి రెడీ అవడానికి.

వనజ భర్త నిరంజన్‌కి వెడ్డింగ్ యానివ ర్సరీ అంటే ప్రత్యేక శ్రద్ధ. పేరుపొందిన ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఆర్నెళ్ల క్రితం ఎం.డీ.గా చార్జి తీసుకున్న నిరంజన్, ఎం.టెక్., ఎం.బి.ఏ, ఏ పని చేసినా మెథాడిక ల్‌గా హుందాగా చేయాలంటాడు. ఈ రోజు కోసం కనీసం నెలరోజులుగా ఏర్పాట్లు జరు గుతున్నాయ్.

బంజారా రోడ్డు పక్క నూతనంగా వెలిసిన ఫైవ్‌స్టార్ హోటల్‌లోఆ రాత్రి డిన్నర్. ముఖ్య మైన మిత్రులందరినీ ఫామిలీస్‌తో సహా ఆహ్వానించాడు నిరం జన్. తన ప్రతిష్ఠకి ఎక్కడా భంగం కల్గ కుండా ఉండాలన్నదే నిరంజన్ తాపత్ర యం. అందు లోనూ తను ఎం.డీ.గా ఆ కంపెనీలో చేరాక ఇస్తున్న ప్రప్రథమ పార్టీ అది.

గులాబీరంగు పాటూర్ చీరలో మిలమిలా మెరిసిపోతున్నది వనజ. మాచింగ్‌గా వేసు కున్న నెక్లెస్, ఇయర్ డ్రాప్స్, బాంగిల్స్ -ఆమె ఐశ్వర్యాన్ని చాటి చెప్తున్నాయి. జుట్టు నలా వదిలివేసి చెవిపక్కనే పింక్ రోజ్ పిన్ చేసింది.

మంచి సొడవు -సొడవుకు తగ్గ లావు. సచ్చటి పసిమిఛాయ -ముస్తాబులో మరింత అందంగా ఆకర్షణీయంగా ఉంది వనజ. నెట్టుదిగి డ్రాయింగ్ రూములోకి అడుగిడుతూ -'ఇక నిరంజన్‌దే ఆలస్యం' -అనుకుంది వనజ.

★ ★ ★

తలుపుమీద మెల్లగా నాక్ చేస్తున్న చప్పుడుకి మెలకువ వచ్చింది వనజకి. 'గది తలుపులు తట్టున్న దెవరబ్బా' నిరంజన్ కోసం పక్కకి తిరిగి చూసింది. డబుల్ బెడ్ బోసిగా వెక్కిరించింది. అయోమయంగా వెళ్ళితలుపు తీసింది వనజ. ఆయమ్మ చేతుల్లోంచి వనజ మీదికి దూకాడు బాబు.

"నువ్వా! అప్పుడే నిద్రలేచాడా... ఆయమ్మా!" బాబుని ముద్దుపెట్టుకుంటూ అంది, వనజ.

"అదేంటమ్మగారూ! అప్పుడే అంటున్నారు... ఇప్పుడు టైం తొమ్మిది మీకు కాఫీ తీసుకురమ్మంటారా?"

"ఒద్దొద్దు ఆయమ్మా -నేనే కిందికి వస్తాను. అయ్యగారు లేచారా...?"

"ఆఁ. స్నానం చేసి, టిఫిన్ తీసుకొని వెళ్ళిపోయారమ్మా. మిమ్మల్ని డిస్టర్బ్ చెయ్యొద్దన్నారు."

ఆయమ్మ వెంట వనజ కూడా కిందికి దిగింది.

గదులు వ్యాక్యూమ్ క్లీనర్‌తో శుభ్రంచేసి, ఏవో కూనిరాగాలు తీస్తుంది సరోజ.

కాఫీ కప్పుతో వచ్చి సోఫాలో కూచుంది వనజ. "ఏంటి సరోజా! మహాఉషారుగా ఉన్నావ్? ఏంటి విశేషం?" అంది వనజ.

"ఔనండి అమ్మగారూ! పండగంత సంతోసం. చూడండి ఈ కొత్తచీర. మావోడు కొనుక్కొచ్చాడు."

"ఆహా! అలాగా!! పోన్లే నేనిచ్చిన చీరని సంక్రాంతికి దాచుకో..." కాఫీ సిప్ చేస్తూ అంది వనజ.

"అమ్మగారూ.. నా సంబరానికి కారణం అడగరేమమ్మా!" లివింగ్ రూం ఫ్లోర్ని తుడుస్తూ అంది సరోజ.

"ఆఁ. ఎందుకేవిఁటి? నీ మొగుడు చీరకొని తెచ్చాడుగా..."

"అందుక్కాదమ్మా... ఈ నెలరోజులుగా ఆడు తాగుడుమాని కూడబెట్టిన డబ్బుతో తెచ్చాడమ్మా చీర. 'సరోజా! ఈ రోజు మన పెండ్లిరోజు... ఈ రోజులాగే మన రోజులన్నీ సంతోషంగా గడవాలే' అంటూ నన్నూ నా బిడ్డను కావిలించుకున్నాడమ్మా. నాకింతకన్నా ఇంకేం కావాలమ్మా..." చెబుతున్న సరోజ ముఖం కాంతి పుంజమయింది.

-క్రితం రాత్రి జరిగిన సంఘటన కళ్ళముందు కదలాడి వనజ మనస్సు కకావికలమయింది. ఎన్నో రోజులుగా ఎదురుచూసిన



పెళ్ళిరోజు, ఎంతో ఆర్భాటంగా మొదలై ఎంతో అర్థనిహీనంగా ముగిసింది.

నిరంజన్, అతని కంపెనీ ఉద్యోగులు -సరదాగా మొదలుపెట్టిన కాక్‌టెయిల్ పార్టీ ఎంత దూరానికి, ఎంత ఘోరానికి తీసుకెళ్ళింది?

ఎం.డీ.గా చార్జ్ తీసుకున్న కొత్తల్లో ఎంతో గర్వంగా చెప్పేవాడు నిరంజన్ తనతో, "వనజా, మా కంపెనీ ఎగ్జిక్యూటివ్స్ అందరూ... ఇంతో...అంతో మందుబాబులోయ్. ఒక్కనేను తప్ప" అంటూ.

పదిరోజుల క్రితం 'స్కై ఈజ్ ద లిమిట్' లో డిన్నరు ముగించి ఇంటికొచ్చిన భర్త మాటల్లో ఒకింత అపస్వరం పల్కింది. వనజ గుచ్చిగుచ్చి అడగ్గా, "నాకు తెలీదా వనజా... వాళ్ళేదో బలవంతం చేస్తే... అలా సిప్‌చేసి వదిలేశాను" అంటూ తప్పుకున్నాడు.

-మరి నిన్నరాత్రి జరిగిందేమిటి...!?

పార్టీలో పీకలవరకు తాగిన తన

> తాగుబోతు మొగుడి చేతుల్లో చావుదెబ్బలు తింటూ కలతల కాపురాన్ని ఎలాగో లాక్కువస్తున్న పేదరాలు సరోజని చూసి జాలిపడింది. ఆ తాగుబోతు నెలా దారికి తెచ్చుకోవాలో హితబోధచేసింది.

భర్త.అయన స్నేహితులు మత్తుఎక్కువై ఉన్మత్తులై పోయారు.

జోక్స్‌తో ప్రారంభమైన వారి సంభాషణా సరళి- తిట్ల నుండి పోట్లాట వరకు వచ్చేసరికి తను కలుగచేసుకోవలసి వచ్చింది.

తనను వారించిందన్న కోపంతో వనజ మీద చేయి చేసుకున్నాడు నిరంజన్ అందరి ముందూ...

నిషాలో ఉన్న భర్తని డిప్యూటీ జి.ఎం. ప్రకాశరావు సాయంతో ఇంటికి చేర్చింది. నిషా దిగాక వనజకు ముఖం చూపలేక గెస్ట్ రూంకెళ్ళి పడుకున్నాడు నిరంజన్.

ఏనాడూ పన్నెత్తు మాటకూడా పడని వనజ అందరి ముందు భర్తచేత అవమానింపబడి మనోవ్యథకి గురై ఆరాత్రి అలా ఏడుస్తూ ఆలోచిస్తూ ఉండిపోయింది పడగ్గదిలో. నిన్నటి వరకు తనని మించిన అదృష్టవంతురాలు వేరొకరు లేరని మురిసిపోయింది వనజ.

తన భర్త ఓ ఆదర్శవ్యక్తిగా ఊహించుకొని స్త్రీకి జీవితంలో కావలసింది ఇంతకన్నా ఇంకేముంటుందని గర్వంతో మిడిసిపడింది.

తాగుబోతు మొగుడి చేతుల్లో చావుదెబ్బలు తింటూ కలతల కాపురాన్ని ఎలాగో లాక్కువస్తున్న పేదరాలు సరోజని చూసి జాలిపడింది. ఆ తాగుబోతు నెలా దారికి తెచ్చుకోవాలో హితబోధచేసింది.

పెళ్ళిరోజు దాని భర్త మద్యంమానేసి మంచి వ్యక్తిగా మారిపోతే,మంచివాడని తలపోసిన తనభర్త మద్యం మత్తులో ఉన్మత్తుడుగా మారి, ఇంగితజ్ఞానాన్ని కోల్పోయి, అందరి ముందు తనపై చేయిచేసుకున్నాడు. అతని మృగప్రవర్తనకు తల దించుకోవలసి వచ్చింది.

ఇక ఉపేక్షించి లాభంలేదు. నిరంజన్‌లో వేళ్ళూన జూస్తున్న ఈ మత్తు పానీయాల మర్రి ఊడలుఅలా వదిలేస్తే- తన కాపురాన్ని కకావికలు చేయకమానవు. మత్తు ఊడల్ని పెకలించి పారవేసే పనికు తాను విశ్రమించరాదనుకుంది వనజ.

●